


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### బాలానందం

**చిన్నప్పుడు స్కూల్లో ఎవరైనా పిల్లలు "టిక్ టిక్"** అని వాయించగానే మా అందరి కళ్ళూ అటు తిరిగేవి, వాళ్ళు ఎగ్జిబిషన్‌కి వెళ్ళొచ్చారని అర్థమయ్యేది. అంతే ఇంటికొచ్చి మా అమ్మని బతిమాలి, ఏడ్చి, పంతం పట్టి ఆ రోజు ఎగ్జిబిషన్‌కి వెళ్ళేవాళ్ళం. అసలు ఎగ్జిబిషన్‌కి వెళ్ళడం ఓ ప్రహసనం. మా అమ్మమ్మ మధ్యాహ్నం నిద్రపోకుండా దిబ్బరొట్లో, పులిహోరో చేసేది. ఒక జంబుఖానా, పెద్ద మరచెంబులో నీళ్ళూ, ఇలా అన్నీ ఓ బుట్టలో సర్ది, మమ్మల్ని తయారు చేసి, ఎగ్జిబిషన్ స్పెషల్ బస్సుకోసం ఎదురుచూసి, అందులోకి ఎక్కించేది.

ఎగ్జిబిషన్ గేట్ దగ్గరే మాకళ్ళు ఆనందంతో వెడల్పు అయ్యేవి. లోపల ఎన్ని రకాల కొట్లూ, ఎన్ని బొమ్మలూ, ఎన్ని బట్టలూ? మా చేతులు బరువైన సంచులతో నొప్పెడుతున్నా, అడుగులు ప్రతి షాపు దగ్గరా ఆగిపోతున్నా, పెద్దవాళ్ళు బలవంతంగా చేతులు పట్టుకుని లాక్కుపోతుండేవారు.

కనిపించిన ప్రతీదీ కావాలని ఏడ్చిగోల చేసే వయసు. "అవి అమ్మడానికి కాదు.." అన్న అమ్మమ్మ అబద్ధం.

కింద నుంచుని చూస్తేనే కళ్ళు తిరిగే జెయింట్ వీల్స్. బావిలో మోటర్ సైకిల్ నడిపే సాహసాలు. మన సంస్కృతిని కళ్ళకి కట్టే దేవాలయం సెట్. ఎగ్జిబిషన్‌కి వెళ్ళొచ్చాం అని స్టేటస్ సింబల్‌గా అందరి చేతుల్లో ఓ ఫోమ్ దిండు ఉండేది.

మా అమ్మమ్మ ఎంత మడిగా పులిహోరా, మినపరొట్టె కాల్చుకొచ్చినా, జాఫర్ మియా చెమట్లు తుడుచుకుంటూ చేసే మిర్చి బజ్జీల కోసం ఎగబడేవాళ్ళం మేము. ఆ రోజు మాత్రం ఐస్‌క్రీమ్, మిర్చిబజ్జీకి కన్సెషన్ ఇచ్చేది అమ్మమ్మ.

ఇంక మాకు తప్పనిసరిగా పెద్దవాళ్ళు కొనేవి ఏంటంటే ‘టిక్కుటిక్కు‘లూ లాయిలప్పలూ! ఒకవేళ బుడగలు కొన్నా, అవి పగిలిపోయాకా నోట్లో పెట్టుకుని, చిన్న చిన్నబుడగలు ఊదుతామనే భయం కొద్దీ మా అమ్మమ్మ "అవి బాయిలర్ లో వేస్తే రంగు రంగుల పువ్వులొస్తాయి" అని మా చేత నమ్మించి, బాయిలర్‌లో వేసేసేది. మేం వెర్రివెంగళాయిల్లా రంగు రంగుల పువ్వులు ఎప్పుడొస్తాయి అని రాక్షసి బొగ్గు పొగ భరిస్తూ అక్కడే కూర్చుని ఉండిపోయేవాళ్ళం. అసలు పెద్దాళ్ళు తలుచుకుంటే చిన్నపిల్లల్ని మోసం చెయ్యడం ఎంతసేపూ?

అలా పెరిగి పెద్దవాళ్ళం అవుతుండగా మా అమ్మమ్మ చేసిన మోసాలన్నీ మాకు అర్థం అయ్యేవి. అవి పిల్లల మంచి కోసమే అని నమ్మి, మేం అవే ఐడియాలు మా పిల్లల మీద ప్రయోగించడం మొదలు పెట్టాం. మా అశ్విన్ నేను వాడిని పెంచిన తీరు మీద పెద్ద పుస్తకమే రాయదలుచుకున్నాడుట.

"బుద్దిగా బడికి వెళ్ళి బాగా చదువుకోండి.. పెద్ద ఉద్యోగాలొస్తాయి అన్నారు. మేం బుద్ధిగా బడికెళ్ళి బాగానే చదువుకున్నాం. ఏవీ?" అంటాడు. అంతటితో ఊరుకోకుండా మా అక్క మనవడు రెండున్నరేళ్ళ వాడిని "నువ్వు పెద్దయ్యాక బాబా అయిపో, ఎకరాలకి ఎకరాలు కబ్జా చెయ్యచ్చు. ఇలాంటి కెరీర్ ఆప్షన్స్ మా పెద్దాళ్ళు ఇవ్వలేదు" అని నేర్పిపెట్టాడు.

"వాడు పెద్దయ్యాకా ఏమౌతావు?" అంటే "బాబా అవుతా" అని నిశ్చయించుకుని, దీపపు సెమ్మెలతో తాళం వేసుకుంటూ భజనలు మొదలుపెట్టాడు.

అలాగే అశ్విన్ చిన్నప్పుడు అమ్మాయిలు నోట్స్ కోసం వస్తే, నేనొచ్చి వాడి బదులు మాట్లాడి, వాళ్ళకి నోట్సులు ఇచ్చి పంపేదాన్నని అప్పటి నుండీ అమ్మాయిలు రావడం మానేసారని దెప్పుతూ ఉంటాడు.

అంతేకాకుండా మా కృష్ణ వెళ్ళి "అన్నయ్యా.. అమ్మ పిలుస్తోంది అనేవాడుట."

అమ్మాయిలతో మాట్లాడుతూ "తర్వాత వస్తానురా అనేవాడు" అశ్విన్.

"ఇప్పుడే రమ్మంది అర్జెంటు అనేవాడు" కృష్ణ

ఇదంతా మేమిద్దరం ప్లాను ప్రకారం చేసామని వాడి అభియోగం. మరి తొమ్మిదోతరగతిలో ఉన్నప్పుడు చదువు మీద శ్రద్ధ పెట్టమని చెపుతాం కదా!

మా అన్నయ్య పిల్లలొస్తే, "చిన్నప్పుడు వీళ్ళు ఎన్ని అబద్ధాలు చెప్పార్రా? పెద్దయ్యాక అవిచెయ్యచ్చు, ఇవి చెయ్యచ్చు, మంచి మార్కులు తెచ్చుకుంటే చాలు, సినిమాల్లో హీరోలా బతకొచ్చు అన్నారు" అంటే వీళ్ళు కూడా మా పిల్లలకి వత్తాసు ఇస్తారు.

"ఏం చెడిపోయార్రా మా మాట విని? వీడు ఆర్మీ ఆఫీసర్ అయ్యాడు. నువ్వు ఆర్కిటెక్ట్‌వి, మాస్టర్స్ చేసావు" అంటాను.

"హూ! చిన్నప్పుడు బుద్ధిగా స్కూల్‌కి వెళ్తూ, చదువుకుంటూ ఎన్నెన్ని మిస్ అయ్యామో తెలుసా?" అంటారు.

క్రికెట్ రోజల్లా ఆడితే తిట్టేదాన్నిట. ఇంట్లో చెప్పకుండా మౌలాలీ కొండమీదకి ట్రెక్కింగ్ అంటూ మూడేళ్ళ తమ్ముడ్ని తీసుకుని ఐదేళ్ళ పిల్లాడు వెళ్ళిపోతే, ఊరంతా వెతుక్కుని, ఇంటికొచ్చాక చీపురు పుల్లతో కొట్టానుట! 'ట్రెక్కింగ్' సరదా పోయిందట.

అశ్విన్ బాల్ పెన్‌తో ఒక చుక్క పెట్టుకుని "మ అమ్మ కొట్టిన చీపురు పుల్ల దెబ్బ" అంటూ చూపిస్తూ ఉంటాడు.

పెరట్లో దుప్పట్లు టెంట్స్‌లా కట్టి, అందులో దూరి పడుకుంటే "పురుగూ పుట్రా ఉంటుంది" అని కోప్పడేదాన్నిట. పుల్లలన్నీ పోగు చేసి మంట పెట్టి, మా మేనల్లుళ్ళు రవీ, శరత్, మా పిల్లలు అశ్విన్, కృష్ణా బంగాళాదుంపలు ఇనపచువ్వలకి గుచ్చి కాలుస్తుంటే, చెట్లు అంటుకుపోతాయని, బలవంతంగా ఇంట్లోకి లాక్కొచ్చానుట. దాంతో 'కాంపింగ్' మంట కలిసిందట.

ఒకరోజు వీడికన్నా చిన్నపిల్లల్ని తీసుకుని, క్వారీ చెరువులో ఈతలు అని వెళ్ళాడు. అది తెలిసి లబోదిబోమంటూ పరిగెత్తాను. వీళ్ళు దూకేలోపల పట్టుకున్నాను. రెండు వాయించే ఉంటాను.

దాంతో 'స్విమ్మింగ్' అనే కళ గండికొట్టిందిట.

సమ్మర్‌లో వంటింట్లోకి వెళ్ళి ఆమ్లెట్‌లాంటివి చెయ్యడానికి ప్రయత్నిస్తే, మా అత్తగారు మడి అంటూ "వీపు చీరేస్తా" అన్నారుట (వీళ్ళైయితే చీరేసారనే చెప్తారు) అలా 'కుకింగ్' అంటే ఇంట్రెస్ట్ పోయిందట.

మేం బ్యాటూ, బంతీ, రబ్బరు బొమ్మలూ కొనిచ్చేవాళ్ళమట. అందుకే వీళ్ళకి 'మార్షల్ ఆర్ట్స్' వైపు దృష్టిపోలేదట.

అందుకే మా కపిల్ గాడికి ఎగ్జిబిషన్‌లో విల్లంబులూ, తుపాకులూ, కత్తులూ కటార్లూ లాంటివేవో సెట్ కొనిచ్చారు. వాళ్ళమ్మ అవి చూసి 'కెవ్వు'మంది.

"పిన్నీ వీడిని టెర్రరిస్టుని చేసారో ఏవిటే?" అని లబలబలాడింది.

మా అశ్విన్ అయితే రాజమౌళి సినిమాల్లోలాగా ప్రత్యేకమైన త్రిశూలం లాంటిదేదో తయ్యారు చేయిద్దాం అన్నాడు. నేను తిట్టి మాన్పించాను. కపిల్‌గాడు మాత్రం చిన్న దీపావళి బాంబులాంటిది ఎక్కడ పేలినా మంచం కిందకి దూరి భోరున ఏడ్చేటంత ధైర్యవంతుడు.

ఇంక మా పిల్లలు చిన్నప్పుడు మేం రన్నింగ్ రేస్‌కి వెళితే "జాగ్రత్తరా, నెమ్మదిగా పరిగెత్తండి" అన్నామట. అందుకని 'స్పోర్ట్స్'లో ట్రై చెయ్యలేదుట.

ఇంట్లో సూపర్‌మేన్ సినిమా చూసి, దోమతెర వేసే గాడ్జెజ్ మంచం ఊచలు పట్టుకుని ఊగుతూ "స్పైడర్ మేన్... స్పైడర్‌మేన్.." అని పాడ్తుంటే "ఒద్దురా.. కింద పడితే దెబ్బలు తగుల్తాయి" అంటూ చెవులు మెలేసానుట. దాంతో వీళ్ళ 'నటన'కీ తెరపడిందిట.

ఇంటర్మీడియట్‌లో ఉండగా మా కృష్ణ ఫ్రెండ్ దగ్గరనుండి గిటార్ తెచ్చుకుని పగలూ రాత్రీ వాయిస్తుంటే చుట్టుప్రక్కల వాళ్ళు భయంతో కకావికలయిపోతున్నారని నేను గిటారు తీసి దాచేసాను. దానితో వాడి 'సంగీత ఝరి'కి ఆనకట్టపడిందట. అక్కడ మా శరత్ కూడా డోలు తెచ్చుకుని వాయిస్తుంటే మా వదినా అదే పని చేసిందట. లేకపోతే ఈ పాటికి రాక్ స్టార్స్ అయ్యేవారుట.

మొత్తానికి ఈ వీళ్ళ చైల్డ్ హుడ్ టార్చర్ పుస్తకంలో ప్రధాన పాత్ర అయిన విలన్ నేనే.

ఇలా మా పిల్లలు కళలని నేను పిందెగానే నేలరాచి, కాయలు కానివ్వలేదని నలుగురూ కలిసి వాపోతుంటారు.

కానీ నలుగురినీ శలవులకి వీళ్ళ చిన్నప్పుడు మా అమ్మ నల్గొండ తీసుకెళితే, మా రవి (ఆర్మీ ఆఫీసర్) టేకు చెట్టు ఎలా కాల్తుందోనని సరదాగా, అగ్గిపుల్ల గీసివేసాడు. అది నిలువునా మండింది.

ఇంకోసారి నాలుగైదు ఏళ్ళున్నప్పుడు మా మావగారు అల్లరి చేస్తే విసుక్కుంటూ కోప్పడ్తున్నారని, మా రవి సలహా మీద అశ్విన్ ఆయన పళ్ళ సెట్టు (Dentures) ఎత్తుకు పోయి బావిలో పారేసాడు.

పాపం ఆయన ఏవీ తినలేక అవస్థ పడుతుంటే, ఇల్లంతా వెదికి, ఎందుకో నాకు ఇది వీళ్ళ పనే అని అనుమానం వచ్చి ఈ ఇద్దర్నీ (ఇంకో ఇద్దరు పుట్టలేదు అప్పటికి) పిలిచి "మీరేనా తీసింది? చెపితే చాక్లెట్లు కొనిపెడితా అంటే "బావిలో పారేసాం అత్తా" అన్నాడు రవిగాడు. అశ్విన్ అప్పుడు కూడా నోరు విప్పలేదు. మారవి,పెళ్ళిలో,అశ్విన్,శరత్,కృష్ణ




నేను బావిలోంచి తోడడానికి మనుషుల్ని దింపాను. సాయంత్రం దాకా ఆ ప్రహసనం సాగింది. ఏవీ దొరకలేదు. "ఇందులో లేదు కదరా" అని నేను మొత్తుకుంటే, అశ్విన్ నోరు విప్పి "ఈ బావికాదు... ఎదురుగుండా ఉన్న చెత్తబావి" అన్నాడు.

ఇంటి ఎదురుగా నీళ్ళు లేని బావిలోకి వెళ్ళి తొంగి చూస్తే, ఒక చెట్టు కొమ్మకి తగులుకుని ముత్యాలదండలా మెరుస్తూ కనిపించాయి.

అలా ముగిసింది ఆ ఎపిసోడ్ ఇవన్నీ చేసిన వీళ్ళని నేను చీపురు పుల్లతో

రెండు దెబ్బలు వేసానని, బాల్ పెన్‌తో గీతలు పెట్టుకుని "మై చైల్డ్ హుడ్ టార్చర్" అంటూ పుస్తకం రాస్తామని యాగీ చేస్తున్నాడు మా అబ్బాయి" (పైగా పులిజర్స్ ప్రైజ్ గ్యారంటీ అని శరత్ గాడి నమ్మకం)

మా అమ్మమ్మ మిమ్మల్ని డిసిప్లిన్డ్‌గా పెంచింది. మేమూ అలాగే పెంచామని అనుకుంటున్నాం. మరి వీళ్ళు ఇలా కంప్లైంట్ ఎందుకు చేస్తారో అర్థం కావడం లేదు.


నాకైతే వీళ్ళు పిల్లల్ని ఎలా పెంచుతారో చూడాలని చాలా ఆసక్తిగా ఉంది. మా రవికి పోయిన నెల కొడుకు పుట్టాడు. వాడికి రిషి అని పేరు పెట్టారు. వాడెన్ని అల్లర్లు చేస్తాడో, వీళ్ళు చిన్న దెబ్బ వెయ్యకుండా, కోప్పడకుండా ఎలా పెంచుతారో చూడాలని ఉంది.

అసలు పుడ్తూనే ఐపాడ్, ఐ పేడ్ తో ఆడుకునే ఈ జనరేషన్ బయటకి వెళ్ళి ఆడినప్పుడు కదా ఇవన్నీ.

మేం ఎండాకాలం శలవుల్లో నిమిషం నిద్రపోకుండా ఆడేవాళ్ళం. సాయంత్రాలు చెయిన్ ఆట, హెల్ప్ ఆట, కోకో, రింగాట, దొంగాట, నేలనా బండనా? ఇలా రకరకాల ఆటలు పరిగెత్తి ఆడుకునేవి ఆడేవాళ్ళం. మధ్యాహ్నాలు ఇంట్లో నీడ పట్టున వామన గుంటలు, వైకుంఠపాళీ, అష్టాచెమ్మా, చింత పిక్కలాట లాంటివి ఆడుకునే వాళ్ళం. బాగా ఆకలి వేసేది. నిద్రపట్టేది.

మా పిల్లల చిన్నతనంలో కూడా మా కాలనీలో ఇళ్ళు తక్కువా, ఖాళీ ప్లాట్లు ఎక్కువా ఉండేవి. అందుకే పిల్లమూకంతా క్రికెట్టూ, ఫుట్‌బాలూ, చోర్ ఆటా, కబడ్డీలాంటివి ఆడి అలిసిపోయి వచ్చేవారు. ఇప్పుడు పిల్లలు ఆడుకోవటానికి గ్రౌండున్న కాలనీ ఒకటీ లేదు. చెట్టూ, చేమా మధ్యన ఆడుకునే అదృష్టం భావితరాలకి ఉంటుందా?

**Click here to share your comments on this story.**


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
2007
చలన చిత్ర నంది బహుమతులు
సాహితి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి